క్లుప్తంగా

పిన్నాపురంలో నేత్రదాన పక్షోత్సవాలు



అవగాహన ర్యాలీలో ఉద్యోగులు, విద్యార్థులు

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మద్దూరు పీహెచ్‌సీ ఆఫ్తాల్మిక్ అధికారి మహబూబ్ హనీఫ్ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేత్రదానం చేయడం వల్ల ఇతరులకు చూపునిచ్చిన వారవుతారన్నారు. నేత్రదానం విషయంలో ఎలాంటి అపోహలు పెట్టుకోరాదన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మనిషి మరణించిన తర్వాతే నేత్రాలను సేకరించి అవసరమైన వారికి అమరుస్తారని చెప్పారు.అనంతరం పాఠశాల నుంచి గ్రామం వరకు ర్యాలీ చేశారు. హెచ్‌ఎం సుమియేన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన



సి.బెళగల్ మోడల్ స్కూల్ విద్యార్థులకు ఐటీపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సి.బెళగల్: స్థానిక మోడల్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సమాచార విద్యపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ వంశీమోహన్ ఆధ్వర్యంలో ఐటీ ఉపాధ్యాయుడు శివకృష్ణ ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఇంటర్మీడియెట్ విద్యార్థుల కోసం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా గురువారం పారిశ్రామిక సందర్శన చేపట్టారు. సి.బెళగల్ గ్రామ సచివాలయం -2లో విద్యార్థులకు సచివాలయ సేవలు, కంప్యూటర్ల వినియోగం, ఐటీ అంశాలపై ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది తెలియజేశారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గురువయ్యశెట్టి

ఓర్వకల్లు: స్థానిక ఆర్‌సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ గురువయ్యశెట్టి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అతిథులు మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కళాశాలలో సీనియర్, జూనియర్ వ్యత్యాసం చూపకుండా సోదరాభావంతో మెలగాలన్నారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీరోడ్డుపై గుంతలు.. ప్రజల ఇబ్బందులు



బి.తాండ్రపాడు శివాలయం వద్ద రోడ్డుపై నెర్రలు, గుంతలు

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని బి.తాండ్రపాడు ఎస్సీ కాలనీలో గ్రామ ఆర్చి నుంచి కాలనీ లోపలి వరకు ఉన్న సీసీరోడ్డు పలుచోట్ల నెర్రలిచ్చి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రత్యేకంగా రాత్రి వేళల్లో వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డు గుంతల్లో నీరు నిల్వ ఉండడంతో ప్రమాదాలు మరింత పెరిగాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హోటళ్లకు రూ.12కే కిలో ఉల్లి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని హోటళ్లకు అవసరమైన ఉల్లిని స్థానిక మార్కెట్ యార్డులో కిలో రూ.12కే అందుబాటులో ఉంచినట్లు డీఎస్‌ఓ ఎం.రాజారఘువీర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మరోవైపు రేషన్ షాపుల్లోనూ కిలో రూ.12కే వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని, అవసరం ఉన్న వారు కొనుగోలు చేయాలని సూచించారు.

ఇన్‌చార్జ్ ఏడీఏగా శ్రీవర్ధన్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ కర్నూలు సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ ఏడీఏగా శ్రీవర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ ఏడీఏగా పనిచేస్తున్న ఎస్.సాలురెడ్డి దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. దీంతో కర్నూలు ఏడీఏ కార్యాలయంలో టెక్నికల్ ఏఓగా పనిచేస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డికి ఏడీఏగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన అక్టోబరు 17వ తేదీ వరకు ఇన్‌చార్జ్ ఏడీఏగా కొనసాగుతారు.

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ

- రైతుల పాట్లు కూటమి ప్రభుత్వానికి పట్టవా?
- యూరియా కొరతపై 9న ఆర్డీఓ కార్యాలయాల ఎదుట నిరసన
- వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ సతీష్



వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్: రాష్ట్రంలో యూరియా కోసం రైతులు పడుతున్న పాట్లు కూటమి ప్రభుత్వానికి పట్టవా అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ విమర్శించారు. యూరియా కొరత, రైతుల సమస్యలపై గురువారం కోడుమూరులో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా యూరియా కోసం రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారని, రైతులకు ఒక యూరియా సంచి ఇవ్వలేని ప్రభుత్వం ఎందుకని ధ్వజమెత్తారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, రైతాంగ సమస్యలను సీఎం చంద్రబాబు గాలికొదిలేసి పాలన సాగిస్తున్నారని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా జగనన్న వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా, పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నారని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించి పాలన కొనసాగిస్తోందని, రైతులకు కనీసం ఒక యూరియా బస్తా కూడా అందించలేని పరిస్థితుల్లో ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని, రైతులంతా కలిసి రావాలని కోరారు. యూరియా కొరతపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 9వతేదీ కర్నూలు ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలపనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తామన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఉపసర్పంచ్ మాదులు, పార్టీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి డీలర్ క్రిష్ణారెడ్డి, కార్యదర్శి బంగారు క్రిష్ణారెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహులు, యువజన విభాగం అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా కార్యదర్శి శివరాముడు, మండల అధ్యక్షులు రమేష్ నాయుడు, సోమశేఖర్‌రెడ్డి, మోహన్‌బాబు, రామాంజినేయులు, నాయకులు వెంకటేశ్వర్లు, తేనేశ్వరరెడ్డి, రమేష్, వెంకటశివుడు, రవికుమార్ రెడ్డి, శివశంకర్, దస్తగిరి, గోపాల్, లింగమయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ నేతల ఇష్టారాజ్యం

- అనుమతుల్లేకుండా మంచినీటి పైపులైన్ ఏర్పాటు

సాక్షి టాస్క్‌ఫోర్స్: తామేమి చేసినా అడిగే వారు లేరనో..లేక అధికార పార్టీ నేతలమనే భావనతో తెలియడం లేదు గాని కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీలో అధికార పార్టీ నేతలు తమ దర్పం ప్రదర్శిస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండానే తమ ఇండ్లకు గతంలో ఉన్న మంచినీటి పైపులైన్‌ను కాదని, మరో పైపులైన్‌ను వేసుకున్నారు. ఇదంతా అధికారుల అనుమతి, పంచాయతీ పాలకవర్గ సభ్యుల తీర్మానం లేకుండానే జరిగింది. కోడుమూరు నుంచి గూడూరుకు వెళ్లే దారిలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ఉన్న కాలనీకి గతంలో మంచినీటి పైపులైన్‌ను నిర్మించారు. ప్రస్తుతం వస్తున్న నీళ్లు తమకు సరిపోవంటూ అధికార పార్టీ నేతలు కొందరు మేజర్ గ్రామ పంచాయతీ, మండల అధికారుల నుంచి అనుమతులు తీసుకోకుండానే రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును తమ ఇష్టానుసారంగా పగులగొట్టి మంచినీటి పైపులైన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. నిబంధనల ప్రకారమైతే మంచినీటి పైపులైన్ ఏర్పాటుకు గ్రామ పంచాయతీ తీర్మానం, ఇంజినీరింగ్ అధికారుల అనుమతి తీసుకోవడంతో పాటు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో పనులు నిర్వహించాలి. అయితే అడిగేవారు లేరనో ఇక్కడ నిబంధనలను తుంగలో తొక్కి అధికార పార్టీ నేతలు తమ ఇష్టానుసారంగా చక్కగా ఉన్న సీసీ రోడ్డును పగులగొట్టి, మంచినీటి పైపులైన్‌ను సొంతంగా తమ ఇండ్లకు వేసుకున్నారు.ఇంత జరిగినా సంబంధిత అధికారులు ఏమి చేయలేకపోతున్నారు. ఈ విషయంపై ఇటు మేజర్ గ్రామ పంచాయతీ అధికారులు గాని, మండల అధికారులుగాని నోరు మెదపడం లేదు.



రోడ్డును పగులగొట్టి అధికార పార్టీ నేతలు అనధికారికంగా వేసుకున్న మంచినీటి పైపులైన్

ఎమ్మెల్యే జయరాంను బర్తరఫ్ చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి మోహన్

కోడుమూరు రూరల్: సోలార్ భూముల విషయంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డిని బెదిరింపులకు గురి చేసిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. గురువారం గూడూరులో సీపీఎం మండల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని బేతపల్లి గ్రామంలో ప్రైవేట్ కంపెనీలు సోలార్ పవర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తున్న పొలాలను పరిశీలించేందుకు వెళ్లిన ప్రభాకర్‌రెడ్డిపై ఎమ్మెల్యే గుమ్మనూరు నోరు పారేసుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి గుమ్మనూరును పార్టీ నుంచి సస్పెండ్ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ మండల నాయకులు రాజశేఖర్, రైతు సంఘం నేత మద్దిలేటి పాల్గొన్నారు.

స్థానికులకు 70 శాతం ఉద్యోగాలివ్వాలి



తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న ఎన్ఎస్‌యూఐ నేతలు

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం సోలార్ పరిశ్రమలో 70 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని, స్థానికులను కేవలం సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకు పరిమితం చేస్తున్నారని, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ప్రతాప్ విమర్శించారు. ఈ మేరకు గురువారం పలు విద్యార్థి సంఘాలతో కలిసి తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో ఎంతో మంది నిరుద్యోగులు ఉన్నారని, ఉన్నత చదువులు, టెక్నికల్ చదువులు చదివిన వారు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారికి ఉపాధి కల్పించకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి సూపర్‌వైజర్, ఇంజినీర్, ఆపరేటర్ ఉద్యోగాలు కల్పిస్తున్నారన్నారు. దీంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కరువయ్యాయని వాపోయారు. ప్రభుత్వం స్పందించి పరిశ్రమల్లో 70 శాతం ఉద్యోగాలు స్థానికులకు కల్పించాలని కోరారు. లేని పక్షంలో త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. అలాగే కార్మికుల పని విధానాన్ని 12 గంటల నుంచి 8 గంటలకు తగ్గించాలన్నారు. పనిచేసే చోట ఏదైనా ప్రమాదం జరిగితే రూ.25 లక్షలు పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. మండల నాయకులు తిరుమలేష్, సూరి, గిరి, రాజు శివ, తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే వేగవంతం చేయండి

గడివేముల: స్వామిత్వ పథకం కింద చేపట్టే ఇళ్ల సర్వేను నిబంధనల ప్రకారం పక్కాగా, వేగంగా నిర్వహించాలని తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ వాసుదేవ గుప్తా సూచించారు. స్వామిత్వ రీసర్వే కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ సహాయకులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామకంఠం పరిధిలో కట్టిన ఇళ్లు, భూములను దగ్గరలో ఉన్న ఇళ్లను సర్వే చేసి వారికి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం స్వామిత్వ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. సర్వేలో తప్పులు దొర్లకుండా యాజమాన్య హక్కులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. సర్వే సమయంలో యజమాని వద్ద డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పథకం ద్వారా ప్రతి ఇంటికి యాజమాన్య హక్కులు కల్పించడంతో న్యాయబద్ధమైన స్పష్టత లభిస్తుందన్నారు. డీటీ హరికృష్ణ, డిప్యూటీ ఎంపీడీఓ మహీధర్‌రెడ్డి, మండల సర్వేయర్ మధు, పంచాయతీ కార్యదర్శులు అంకన్న, మాబాషా, వీఆర్వోలు నాయుడు, హరీంద్ర, సామన్న, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

లోడ్‌బర్మ్ పెండింగ్ పనులకు ప్రతిపాదనలు



గతంలో చేసిన లోడ్ బర్మ్ పనులు

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు జలాశయానికి మొదటిసారిగా 2017లో నీటి నిల్వ ప్రారంభించారు. మొదటిసారిగా నిల్వ చేయడం వల్ల విపరితమైన లీకేజీలు ఏర్పాడ్డాయి. దీంతో ప్రభుత్వం ఎక్స్‌పర్ట్ కమిటీని ఏర్పాటు చేయగా ఆ కమిటీ సూచనల మేరకు లోడ్‌బర్మ్ పనులు చేపట్టారు. ఇందుకు కోసం అప్పట్లో రూ.45 కోట్లు కేటాయించి 2450-2950 వరకు పనులు చేపట్టారు. సగం వరకు పనులు చేశారు. తిరిగి పూర్తి స్థాయి పనులు చేసేందుకు అధికారులు గత నెలలో రూ.23 కోట్లకు ప్రతిపానదలు పంపారు. ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపితే 2250-2450 వరకు పనులు పూర్తి చేయనున్నారు. దాదాపుగా 500 మీటర్ల వరకు ఈ లోడ్‌బర్మ్ పనులు చేపడతారు. ఈ పనులు పూర్తి చేస్తే లీకేజీలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు వీలుంటుందని ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యుల నివేదికలో తెలియజేసినట్లు సమాచారం. అయితే జలాశయం నిర్మాణం పూర్తిగాక ముందే నీటిని నిల్వ చేయడం వల్లనే ఈ సమస్య ఏర్పడిందని పలువురు విశ్రాంత ఇంజినీర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు.



బి.తాండ్రపాడు బీసీకాలనీలో వీధి కుక్కలు



జెడ్పీ స్కూల్ ఆవరణలో వీధి కుక్కల సంచారం

వీధి కుక్కల బెడద

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో వీధి కుక్కల ధాటికి గ్రామస్తులు బయటికి వెళ్లడానికే భయపడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన కూడళ్లలో కుక్కలు గుంపులుగా తిరగడంతో చిన్నారులు సైతం వణికిపోతున్నారు. బి.తాండ్రపాడు గ్రామంలోని బీసీ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద వీధి కుక్కలు తిరుగుతుండడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలపై దాడి జరిగే ప్రమాదం ఉందని ఆరోపించారు. గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని స్కూల్ పరిసరాల్లో కుక్కల బెడద నివారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

గంగమ్మ ఒడికి గణనాథులు



వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న మహిళలు



లడ్డూను దక్కించుకున్న ఆనందంలో భక్తులు

కల్లూరు: గత తొమ్మిది రోజులుగా పూజలందుకున్న గణనాథులు గురువారం సాయంత్రం నిమజ్జనానికి తరలివెళ్లాయి. కల్లూరు అర్బన్ పరిధిలోని వార్డులలో కొలువైన గణనాథులకు ఆయా మండపాల నిర్వాహకులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గణేష్ విగ్రహాల ముందు భక్తులు కేరింతలు, కోలాటాలతో రంగులు చల్లుకుంటూ సంబరంగా గణనాథులను నిమజ్జనానికి తరలించారు. స్వామినగర్ నాగులకట్ట వద్ద వినాయకుడి లడ్డూను కాలనీకి చెందిన అడ్వకేట్ బి.ఎల్ల శ్రీనివాసులు, గౌసియా దంపతులు రూ.73 వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు.



శోభాయాత్రలో మహిళల కోలాటం

10న సర్వసభ్య సమావేశం

ఓర్వకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు రాబోవు మూడు నెలల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులకు, గత మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ఈ నెల 6వ తేదీలోగా మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. గత సమావేశంలో కొన్ని శాఖలకు సంబంధించి నివేదికలు సమర్పించలేదని దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రస్తుతం అన్ని శాఖల వారు తప్పనిసరిగా ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశం ఉందని, కావున ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హెచ్చరించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక



ఆదామ్‌బాషా

సి.బెళగల్: మండలంలో ఎంఈఓ - 2గా విధులు నిర్వర్తిస్తున్న ఆదామ్‌బాషా, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో తన సేవలకు గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈయన, 2017 నుంచి ఇప్పటివరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సేవలకు గుర్తింపుగా డీఈఓ శ్యామ్యూల్ పాల్ సిఫారసుతో ఆదామ్ బాషాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు. ఆయన్ను మండల విద్యాశాఖ అధికారిణి జ్యోతి, మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

యూరియా పక్కదారి పట్టకుండా నిఘా

కర్నూలు(సెంట్రల్): యూరియా పక్కదారి పట్టకుండా పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయాధికారులు నిఘా ఉంచాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డీఓలు, వ్యవసాయాధికారులు, డీఎస్పీలు, తహసీల్దార్లతో సమీక్షించారు. యూరియా పక్కదారి పట్టకుండా ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్‌పోస్టుల్లో నిఘా ఉంచాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1329 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, గురువారం మరో 904 టన్నులు, 6వ తేదీ లోపు 2600 టన్నులు మొత్తం 6104 టన్నుల యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. కౌతాళం, హోళగుంద, ఆదోని, మంత్రాలయం, కోడుమూరు, కోసిగి, ఆలూరు, పత్తికొండ, సీబెళగల్ మండలాల వ్యవసాయాధికారులతో ప్రత్యేకంగా మాట్లాడుతూ...ఆయా మండలాల్లోనే ప్రత్యేకంగా సమస్యలు వస్తున్నాయని, పంపిణీ సాఫీగా సాగేలా చూడాలని ఆదేశించారు. నానో యూరియాను వాడాలని రైతుల నంబర్లకు వాట్సాప్ చేయాలని సూచించారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచల రెడ్డి

కల్లూరు: గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ నాగశేషాచల రెడ్డి హెచ్చరించారు. గురువారం చిన్నటేకూరు గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వెయ్యకుండా పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు (క్లాప్ మిత్రలు) ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.